https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 306 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ ఆదివారం, సెప్టెంబర్,6, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-




# గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం



**బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం**
**- మోదీ తెలివైన నాయకుడన్న బార్ట్ డె వెవర్**
**- మోదీతో భేటీ కావడం తనకు లభించిన గౌరవమని వ్యాఖ్య**
**- విశ్వవేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందన్న బెల్జియం ప్రధాని**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,5:**
ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని... కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు.
విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకుసిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

# విద్యాశాఖలో కీలక మార్పులు..

**టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ - పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్**
**- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం - రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ -**
**సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్ - పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ**



**హైదరాబాద్,సెప్టెంబర్,5:**
విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.
తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు.
పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు.
ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలాబాధ కలిగించిందన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

# కొండా సురేఖ స్థానంలో ఎవరు?

**కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు - కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**
**ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్ - కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ**
**కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదు - విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయం: మహేశ్**



**హైదరాబాద్,సెప్టెంబర్,5:**
కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు. **ఇప్పట్లో విస్తరణ లేనట్లే..!:** ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు.
రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారంలేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

# రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం..

**ప్రజలకు మరో న్యాయమా?: రఘునందన్ రావు - సింఫనీ పార్క్‌హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం**
**12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారన్న రఘునందన్ రావు - ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్**

**హైదరాబాద్,సెప్టెంబర్,5:**
రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతు న్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితన నివాసాన్ని ఏదరఖాస్తు ఆధారంగా 22 ఏజాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని,



తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం.. రెడ్ అలర్ట్ జారీ..!

***ఢిల్లీ-ఎన్‌సీఆర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు - వాతావరణ శాఖ నుంచి రెడ్ అలర్ట్ జారీ***
***లోతట్టు ప్రాంతాలు జలమయం, విమాన సేవలకు అంతరాయం - ప్రయాణికులు ముందుగానే విమాన వివరాలు చూసుకోవాలని సూచన - రేపటి నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం***



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,5:**
దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శనివారం ఉదయం కూడా కుండపోత వర్షంముంచెత్తింది. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం కలగడంతో పాటు,విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమాన సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ స్థితిగతులను ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి అదనపు సమయం పట్టవచ్చని హెచ్చరించాయి. అయితే, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రస్తుతానికి సాధారణంగానే కొనసాగుతున్నాయనివిమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ స్పష్టం చేసింది. నగర పరిధిలోని కన్నాట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, గీతా కాలనీ, అక్బర్ రోడ్ వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి.

# కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది

హైదరాబాద్,సెప్టెంబర్,5:
సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు.



గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు.
హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

# నగ్న పూజల పేరుతో మోసం..

**విదేశీ మహిళను బ్లాక్‌మెయిల్ చేసిన జ్యోతిష్కుడు అరెస్ట్ - నగ్న పూజల పేరుతో విదేశీ మహిళకు వేధింపులు - చిలుక జోస్యం చెప్పి నమ్మించిన ఇసక్కిముత్తు - వీడియో కాల్ రికార్డు చేసి డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ - బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్**

**చెన్నై,సెప్టెంబర్,5:**
వీడియో కాల్‌లో ఓ విదేశీ మహిళతో నగ్నంగా పూజలు చేయించి, ఆ దృశ్యాలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ఓ జ్యోతిష్కుడిని చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, కెనడాకు చెందిన 37 ఏళ్ల మహిళ ఇటీవల తమిళనాడు పర్యటనకు వచ్చారు. ఈ క్రమంలో చెన్నైలోని బెసెంట్ నగర్ బీచ్‌లో ఆమెకు చిలుక జోస్యం చెప్పే ఇసక్కిముత్తుఅనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఆమె జాతకం చూస్తున్నట్లు నటించిన నిందితుడు, "మిమ్మల్ని గతంలో టీవీలో చూశాను, నేను చెప్పినట్లు చేస్తే మీరు జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారు" అని ఆమెను నమ్మబలికాడు. అనుకున్నది సాధించాలంటే నగ్నంగా ఒక ప్రత్యేక పూజ నిర్వహించాలని, వీడియో కాల్ ద్వారా కూడా దీనిని చేయవచ్చని ఆమెకు సూచించాడు. అతని మాటలను నమ్మిన బాధితురాలు వీడియో కాల్‌లో నగ్నంగా పూజలో పాల్గొన్నారు. ఇందుకుగానుఆమె నుంచి రూ. 20,000 వసూలు చేశాడు. కొద్దిరోజుల తర్వాత



ఆమెకుఫోన్ చేసిన నిందితుడు, తన వద్ద ఉన్న నగ్నవీడియోను సోషల్ మీడియాలో విడుదల చేస్తానని, అలా చేయకూడదంటే డబ్బు ఇవ్వాలని బెదిరించడం ప్రారంభించాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం మాంబలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడు ఇసక్కిముత్తును అరెస్ట్ చేశారు.

## నాగ్‌పూర్‌లో దారుణం

# వంట చేయలేదని భార్యను చంపిన భర్త



**నాగ్‌పూర్,సెప్టెంబర్,5:**
నాగ్‌పూర్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. డ్యాన్స్ క్లాస్‌కు వెళ్లాలనే ఉద్దేశంతో వంట చేయడానికి నిరాకరించిన భార్యను భర్తకిరాతకంగా హత్య చేశాడు. ఈ సంఘటనకు సంబంధించిన వాస్తవాలు పోస్టుమార్టం నివేదిక ద్వారా వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే, కృష్ణ లాల్ యాదవ్ (41) పని ముగించుకుని ఇంటికి చేరుకున్నాక,భార్య యామిని (38)ని తనకు, ఇద్దరు పిల్లలకు భోజనం సిద్ధం చేయమని కోరాడు. అయితే, తమ హౌసింగ్ సొసైటీలో నిర్వహించే డ్యాన్స్ క్లాస్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న యామిని వంట చేయడానికి నిరాకరించింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న కృష్ణ లాల్ ఆవేశంతో ఊగిపోతూ, పిల్లల కళ్లెదుటే యామిని మెడ, పొత్తికడుపు భాగాలపై విచక్షణారహితంగా దాడిచేశాడు. దాడి జరిగిన కొద్దిసేపటికే యామిని ఆరోగ్య పరిస్థితి విషమించింది. తీవ్రమైన అంతర్గత గాయాల కారణంగా కడుపు భాగం ఉబ్బిపోవడంతో ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యామిని మరణించింది. పోలీసులు తొలుత దీనిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే, పోస్టుమార్టం నివేదికలోమెడ ఎముక విరగడం,గొంతు నులిమిన గుర్తులు ఉండటంతో పాటు ప్రేగులకు తీవ్ర గాయాలైనట్లు తేలింది. దీంతో పోలీసులు ఈ కేసును హత్యగా మార్చి నిందితుడు కృష్ణ లాల్‌ను అరెస్ట్ చేశారు. గతంలోనూ వారిమధ్య గొడవలు జరిగేవని, అయితే అది తమ కుటుంబ వ్యవహారమని, ఎవరూ జోక్యం చేసుకోవద్దని యామిని కోరడంతో తాము దూరంగా ఉన్నామని ఆమె సోదరుడు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నగదును డ్రా చేసుకొని వెళ్తూ..!

**-రూ.8వేల డబ్బులను జారవిడుచుకున్న ఖాతాదారుడు...**
**-నారాయణపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో సంఘటన**
**-డబ్బులు తీసుకొని వెళ్లిన సదరు మహిళ కోసం గాలించిన లభించని ఆచూకీ...**
**-సంఘటనకు సంబంధించి బ్యాంకు సిసి ఫుటేజ్ లో దృశ్యాలు...**

నారాయణపేట,(డీకే చాటింపు): బ్యాంకులో నగదును డ్రా చేసుకొని బయటికి వెళ్తున్న క్రమంలో ఓ వ్యక్తి చేతి నుంచి 8 వేల రూపాయల కట్ట కింద పడటం..అక్కడే ఉన్న ఓ మహిళ వెంటనే ఆ నోట్ల కట్టను తమ సంచిలో వేసుకుని బ్యాంకు నుంచి నిష్క్రమించారు.క్షణాల్లోనే చోటు చేసుకున్న ఈ సంఘటనతో ఆ వృద్ధుడు తేరుకున్నలోపే డబ్బులు తీసుకున్న సదరు మహిళ బ్యాంకు నుంచి బయటికి వెళ్లిపోయారు.డబ్బులు పోగొట్టుకున్న బాధిత ఖాతాదారుడు ఆవేదనతో బ్యాంకు దగ్గర కానవచ్చారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.నారాయణపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో శనివారం ఉదయం11.38 గంటల సమయంలో నారాయణపేట మండలం లింగంపల్లి తండాకు చెందిన బాలు నాయక్ బ్యాంకులో కొంత నగదును డ్రా చేశారు. సదరు వ్యక్తి క్యాష్ కౌంటర్ నుంచి నగదును తీసుకొని సంచిలో పెట్టుకొని మిగతా 8 వేల నోట్ల కట్టను చేతిలో పట్టుకొని క్యాష్ కౌంటర్ నుంచి ముందుకు వస్తున్న సమయంలో ఆయన చేతిలో ఉన్న ఎనిమిది వేల రూపాయల నోట్ల కట్ట జారీ కిందపడింది.ఈ విషయాన్ని సదరు వ్యక్తి గ్రహించకుండానే బ్యాంకు నుంచి బయటికి వెళ్లిపోయారు.కింద పడిన ఎనిమిది వేల నోట్ల కట్టను అక్కడే ఉన్న ఓ మహిళ చూసి వెంటనే ఆ డబ్బులను తీసుకొని సంచిలో వేసుకొని క్షణాల్లోనే బ్యాంకు నుంచి వెళ్లిపోయారు.సదరు వ్యక్తి చేతి నుంచి డబ్బు కింద పడడం..ఆ డబ్బును సదరు మహిళ తీసుకొని తమ సంచిలో వేసుకొని బ్యాంకు నుంచి వెళ్లిపోయిన దృశ్యాలు బ్యాంకు సిసి ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. బ్యాంకులో డబ్బులు జార విడిచిన వ్యక్తి బయటికి వెళ్ళిన తర్వాత తమ కుటుంబ సభ్యులకు డబ్బులు ఇచ్చే సమయంలో 8 వేల రూపాయలు తక్కువగా ఉన్నట్లు గ్రహించారు.వెంటనే బ్యాంకు లోపలికి వెళ్లి విచారించగా అక్కడే ఉన్న మరో మహిళ కింద పడిన డబ్బులను గుర్తు తెలియని మహిళా తీసుకుందని..తాము చూసినట్లు వెల్లడించడంతో డబ్బులు తీసుకున్న సదరు మహిళ ఆచూకీ కోసం బ్యాంకు పరిసరాల్లో పలువురు గాలించారు. అయితే బ్యాంకులో డబ్బులు తీసుకున్న సదరు మహిళ ఆచూకీ మాత్రం లభించలేదు.



ఖాతాదారులుక్యాష్ కౌంటర్ నుంచిడబ్బులు డ్రా చేసిన తర్వాత భద్రంగా తీసుకొని వెళ్లాలని.. డబ్బులు ఉన్న సమయంలో అజాగ్రత్తగా ఉండరాదని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప తెలిపారు. ఖాతాదారుడు అజాగ్రత్తగా ఉండడంతోనే కొంత డబ్బులు కిందపడడం..గుర్తు తెలియని మహిళ ఆ డబ్బులనుతీసుకొని బ్యాంకు నుంచి వెళ్లిపోవడం జరిగినట్లు బ్యాంక్ అధికారులు నిర్ధారించారు."ఏమారుపాటు"(అజాగ్రత్తగా)ఉండడంతోనే సదరు ఖాతాదారుడు బ్యాంకులో డబ్బులను పోగొట్టుకోవాల్సి వచ్చింది. అయితే డబ్బులు తీసుకెళ్లిన గుర్తు తెలియని మహిళ వివరాలు మాత్రం తెలియ రాలేదు.డబ్బులు తీసుకొని వెళ్ళిన మహిళా బ్యాంకులో లావాదేవీల కోసం వచ్చారా.. లేక ఎవరైనా వెంబడి వచ్చారా అనే విషయంపై బ్యాంకు అధికారులు సిసి ఫుటేజీ ద్వారా పరిశీలిస్తున్నారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన

**- న్యూ దిల్ సుఖ్ నగర్ కాలనీ సీనియర్ సిటిజెన్స్**



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 5( డీకే చాటింపు)** ద్వారకాపురం సీనియర్ సిటిజెన్స్ భవనం విషయంలో సమస్యను పరిష్కరించినందుకు ద్వారకాపురం, న్యూ దిల్ సుఖ్ నగర్ కాలనీ సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులు శనివారం నాడు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైతన్యపురి బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు ప్రసాద్, రాఘవ రెడ్డి, శ్రవణ్, సుబ్బారావు, శశికాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## సర్ ప్రత్యేక క్యాంపును పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య....



బెల్లంపల్లి(డీకే చాటింపు )సర్ ప్రత్యేక క్యాంపులో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని 6వ వార్డులో 55, 56 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపులను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి, డీటీ, ఆర్ఐ, వార్డు అధికారి, బీఎల్ ఓ లు పాల్గొన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు.

# గోవింద..గోవిందా..కనకాద్రి స్వామి గోవిందా

**-గోవింద నామస్మరణతో కనకాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు... -నెముళ్ల పల్లి శ్రీ కనకాద్రి లక్ష్మీ నరసింహస్వామి జాతర మహోత్సవాలు... -పుష్కరిణిలో భక్తుల పుణ్యస్నానాలు...**
**-దాసంగాలతో స్వామికి నైవేద్యం పెట్టి మొక్కుబడులు చెల్లించుకున్న భక్తులు...**
**-పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు...-ఘనంగా జల్ది బిందె, రథోత్సవ కార్యక్రమాలు...**
**-అనుకూలించిన వాతావరణంతో పులకించిన భక్తులు...!**
**-నారాయణపేట రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు...**

**నారాయణపేట,(డీకే చాటింపు):** గోవింద..గోవిందా.. కనకాద్రి స్వామి గోవిందా..! స్మరణతో భక్తులు శ్రీ కనకాద్రి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామిని దర్శించుకుని పులకించిపోయారు.భక్తుల గోవింద నామస్మరణతో స్వామి సన్నిధి నినాదించింది.! నారాయణపేట మండలం అభంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నెముళ్ల పల్లి గ్రామ సమీపంలో కొలువు దీరిన శ్రీ శ్రీ శ్రీ కనకాద్రి లక్ష్మీ నరసింహస్వామి జాతర మహోత్సవాలు శనివారం వైభోపేతంగా జరిగాయి. శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు తడి బట్టలతో స్వామివారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయం దగ్గర భక్తుల సందడి కానవచ్చింది.



**దాసంగాలు పెట్టి...**

శ్రీ కనకాద్రి లక్ష్మీనరసింహ స్వామి జాతర మహోత్స వాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని దాసంగాలతో మొక్కుబడులు తీర్చుకున్నారు.భక్తులు జాతరలో దాసంగాలతో స్వామి వారికి నైవేద్యం పెట్టారు.మరి కొందరు టెంకాయలను,మరి కొందరు కోడెలు,ఆవు దూడలు, తలనీలాలు తదితర రూపాల్లో స్వామి వారికి మొక్కలు చెల్లించుకున్నారు.కరుణించయ్య కనకరయ్య..!!అంటూ స్వామి వారిని ప్రార్థించారు. ఉపవాస దీక్షలతో భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.తమ ఇంటి ఇలవేల్పు శ్రీ కనకాద్రి స్వామిని దర్శించు కునేందుకు భక్తులు ఈసారి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**స్వామివారి జల్ది బిందె...**

ఉదయం పల్లకి సేవ, మధ్యాహ్నం జల్ది బిందె, అభిషేకం,స్వామివారి అలంకారోత్సవం రాత్రికి రథోత్సవం కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి.ఆదివారం స్వామి వారికి అర్చనలు,అభిషేకం, పల్లకి సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయని జాతర నిర్వాహకులు



తెలిపారు.జాతరలో మిఠాయి,గాజులు, పిల్లల ఆట వస్తువులు తదితర దుకాణాలు ఖరీదు దారులతో నిండుకున్నాయి.ప్రధానంగా ఈసారి వాతావరణం పూర్తిగా అనుకూలి ంచడంతో జాతర మైదానం భక్తులతో సందడి చేసింది.పలువురు భక్తులు స్వామి సన్నిధికి శుక్రవారం రాత్రి చేరుకొని జాతరలో విడదీసి శనివారం స్వామివారిని ఉపవాసా దీక్షలతో దర్శించుకున్నారు. మరికొందరు శనివారం ఉదయం స్వామి సన్నిధికి చేరుకొని స్వామిని దర్శించుకుని రాత్రికి అక్కడే నిద్రించారు.నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై సతీష్ రెడ్డి ఆధ్వరంలో జరిగిన బందోబస్తులో ఏఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుల్ రంజిత్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్,ఆనంద్ గౌడ్,ప్రదీప్ కుమార్ తో పాటు నారాయణపేట సర్కిల్ కి సంబంధించిన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## బెల్లంపల్లి మండల ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా రాజ్ మహమ్మద్...



**బెల్లంపల్లి (డీకే చాటింపు** )బెల్లంపల్లి మండల ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా రాజ్ మహమ్మద్ ఎంపికయ్యారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రాజ్ మహమ్మద్ ను శాలువా, మేమేంటోతో ఘనంగా సత్కరించారు.కాగా రాజ్ మహమ్మద్ అకెనపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో పిడి గా విధులు నిర్వర్తిస్తున్నారు.ఈ కార్యక్రమం లో ఎం ఈ వో పోచయ్య, అకెనపల్లి ప్రధానోపాధ్యాయులు దామోదర్, వివిధ పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు సంజీవ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. రాజ్ మహమ్మద్ కు అవార్డు రావడం పట్ల పలువురు ఉపాధ్యాయ సిబ్బంది, వికె స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, అభినందనలు తెలిపారు

# దివ్యాంగుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ ఐదు ( డీకే చాటింపు):**నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి మరియు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.. అనంతరం దివ్యాంగ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలను నృత్యాలు పాడిన పాటలను తిలకించారు.. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు మరియు స్నేహ సొసైటీలో ఉపాధ్యాయ విధులు నిర్వర్తిస్తున్న వారిని శాలువలు జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా స్నేహ సొసైటీ దివ్యాంగ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో తెలియని దివ్యాంగ విద్యార్థులకు చదువు చెప్పడం పూర్వజన్మ సుకృతం అన్నారు.. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన స్నేహ సొసైటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.. మొదట ఇక్కడి మానసిక, అంద దివ్యాంగ విద్యార్థులను చూసినప్పుడు ఎలా తట్టుకోగలను వీరికి ఏ విధంగా చదువు చెప్పగలను అనే ఆలోచన వచ్చినప్పటికీ కూడా పాఠశాల ప్రిన్సిపాల్ మరియు నిర్వాహకుల ప్రోత్సాహంతో చెప్తూ ముందుకు సాగడం సంతోషకర మన్నారు... అనంతరం ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల నుండి విచ్చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ అన్ని రకాలుగా శారీరకంగా మానసికంగా బాగుండి ఆర్థిక పరంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం అన్ని ఉన్నప్పటికీ కూడాను సాధారణ విద్యార్థులను ఏ విధంగా చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పేందుకు ఎంతో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు... అలాంటిది స్నేహ సోసైటీలో ఉన్న దివ్యాంగ విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో మరియు చదువుతోపాటు పాటలు పాడడం, నృత్యాలు చేయడం, మరియు ఇతరత్రా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు.. భగవంతుడు శరీరానికి లోపం ఇచ్చి ఉండొచ్చు గాని వారిలో మేధోసంపత్తి అనేది చాలా దాగి ఉందని స్పష్టం చేశారు... అలాంటి మేధో సంపత్తిని స్నేహ సొసైటీ ఉపాధ్యాయ సిబ్బంది వెలికి తీసి వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ప్రోత్సాహం అందించడం గొప్ప విషయం అన్నారు.. ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.. విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రుల తర్వాత గురువులదే బాధ్యత... ప్రతి గురువు గురుతర బాధ్యతల నేపధ్యంలో ఎల్లప్పుడూ విద్యార్థుల అభ్యున్నతి కోసం పాటుపడతారన్నారు.. తల్లిదండ్రులు,గురువులకు సహకరించినప్పుడు విద్యార్థులు క్రమశిక్షణతో మరియు విద్యలో సామాజిక రంగంలో ముందంజలో ఉంటారని వారు స్పష్టం చేశారు.. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను మరియు స్నేహ సొసైటీ ఉపాధ్యాయులను స్నేహ సొసైటీ వ్యవస్థాపకులు కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతిలను ఘనంగా శాలువలతో సన్మానించారు.. అలాగే దివ్యంగా మానసిక విద్యార్థులు తమ గురువైన స్నేహ సొసైటీ కార్యదర్శిని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటంతో ఘనంగా సన్మానించారు..



# ఎస్.పి.ఆర్.ఎల్లాపూర్లో మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన..కరస్పాండెంట్ గౌరిశెట్టి జగన్మోహన్ వెల్లడి

**హనుమకొండ సెప్టెంబర్ 5 (డీకే చాటింపు)**హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ శివారులోని ఎస్.పి.ఆర్. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ హన్మకొండ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్ మాట్లాడుతూ ఈ రోజుల్లో రక్తదానం ఒక సామాజిక బాధ్యతని, ముఖ్య అవసరమని, ప్రాణాలను నిలబెట్టే శక్తి రక్తానికి ఉందని, అలాగే ఆరోగ్యంగా ఉండాలంటే రక్తశుద్ధి తప్పనిసరని, అందుకే సంవత్సరానికి కనీసం రెండు సార్లు రక్త దానం చేయాలనీ, అది పౌరుని సామాజిక బాధ్యతగా భావించాలనీ, ఒక వ్యక్తి రక్తదానం చేయడం వల్ల మరో నలుగురిని కాపాడవచ్చని, ప్రాణాలను కాపాడే ప్రయాణంలో ప్రతి రక్తపు చుక్కా విలువైనదేనని, అదే విధంగా ఈనాటి విద్యార్థినీ విద్యార్థులైన మీరు ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రేపటి బావిభారత పౌరులుగా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. నేటి సమాజంలో ప్రతీది వ్యాపారంగా చూస్తున్న తరుణంలో నా ఆలోచనలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ముందుకు రావడం వలన రెడ్ క్రాస్ సొసైటీ,



హన్మకొండ ఆధ్వర్యంలో పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది 50 మంది రక్తదానం చేశారు.అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ జీవితం ఉరుకులు పరుగులతో జీవితాన్ని సాగిస్తున్నారు, ఆ తొందరలో ఎంతో మంది రహదారుల్లో మోటారు వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపి అనేక ప్రమాదాలకు గురి అవుతున్నారు. వారిని కాపాడడానికి అత్యవసరంగా రక్తం అవసరమవుతుంది కాబట్టి అలాంటి వారిని కాపాడుకోవడం కోసం రక్త దానం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, అన్ని దానాలలోకెల్ల రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కా పాడవచ్చునని వివరించారు.అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానం చేసి వారి గురు భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువుల గొప్పతనాన్ని తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో 22ఏ భూముల బాధితుల పక్షాన చలో హైదరాబాద్

**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 5 (డీకే చాటింపు):**ప్రైవేటు పట్టా భూములను 22 ఏ సెక్షన్ కింద చేర్చి ప్రజలకు అష్ట కష్టాల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై సమరభేరి మోగించడానికి బిజెపి ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం ఉదయం నిజామాబాద్ ఆర్మూర్ కామారెడ్డి నిర్మల్ బైంసా ఆదిలాబాద్ నుండి ఎమ్మెల్యేలు వారి అనుచర గణం హైదరాబాద్కు బయలుదేరి వెళ్లారు. ముఖ్యంగా పేదలు మైనారిటీల భూములు ఈ 22 ఏ సెక్షన్ కింద అన్యాయంగా చేర్చి కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసానందం పొందుతుందని అన్నారు. ముఖ్యంగా నిషేధిత జాబితాలో ప్రభుత్వ భూములు అసైన్డ్ భూములు ఎండోమెంట్ మరియు వక్ఫ్ భూములు చేర్చవలసి ఉండగా పేదల పట్టా భూములు చేర్చడం సిగ్గుచేటని అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నిజాంబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితరులు హైదరాబాదులోని ఇందిరా పార్క్ లో ధర్నాకు వెళ్లారు.



డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
ఆదివారం, సెప్టెంబర్,6, 2026

# అభద్రత..!?

సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కోటి ఆశలతో ఆ రంగాన్ని ఎంచుకున్న యువతరంలో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్న ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు మారిపోతోంది. ఏ రోజు ఉద్యోగం ఉంటుందో, ఏ రోజు ఊడుతుందో తెలియని స్థితి నెలకొంటోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం చేసిన ప్రకటన ఈ పరిస్థితికి తాజా నిదర్శనం. టిసిఎస్ ఒక్కటే 12 వేల మందిని ఇంటికి పంపనుందని సమాచారం. పిడుగుపాటు లాంటి ఈ ప్రకటనతో టిసిఎస్ ఉద్యోగుల్లో కలకలం రేగింది. ఒక్క టిసిఎస్సే కాదు, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రోల వంటి సంస్థలదీ ఇదే బాట! ఉద్యోగులను తొలగించడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో మిడ్‌లెవల్, సీనియర్ మేనేజర్లే అత్యధికులు! దేశీయ సంస్థలే కాదు, గ్లోబల్ టెక్ కంపెనీగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ సంస్థ 15వేల మంది ఉద్యోగులను ఇళ్లకు పంపింది. మే నెలలో ఆరువేల మందిని, జులైలో 9వేల మందిని ఆ సంస్థ తొలగించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో ఇది నాలుగు శాతం! క్లౌడ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆ సంస్థ తొలగిస్తోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 61వేల మందికిపైగా టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ తదితర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారు. 2019 తరువాత నుండి ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నియామకం దాదాపు సగానికి పైగా తగ్గిపోయింది. రానున్న రోజుల్లోనూ ఈ పరిణామం కొనసాగనుంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 'ఎఐ ఫస్ట్' సంస్కరణల్లో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయంటూ సత్య నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. భారీ లాభాలు వస్తున్నప్పటికి ఉద్యోగులపై వేటు వేయడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తోంది. దీనికి ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణాలను ఆ సంస్థ చెబుతోంది. మన దేశంలో కొంతకాలంగా టెక్‌రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది. సంస్థలు నష్టాల్లో లేనప్పటికీ, గతంతో పోలిస్తే లాభాలు ఆశించినట్లు లేవని చెబుతున్నారు. ఫలితంగా ఐటి సేవల్లో మందగమనం చోటుచేసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్లోబల్ క్లయింట్లకు తక్కువ ఖర్చుతో సేవలందించడమన్నది భారత టెకీ రంగం ప్రధాన వ్యూహంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఏమైనప్పటికీ, సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా 40 అంతకన్నా ఎక్కువ వయసున్న వారు ఉద్యోగాలను కోల్పోతే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. చేస్తున్న ఉద్యోగాలపై ఉన్న నమ్మకంతో చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న దుస్థితి అక్కడక్కడా కనపడుతోంది. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని సంస్థలు ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నాయి. అనధికారికంగా పనిగంటలు పెంచడం, పని ఇవ్వకుండా బెంచ్‌పై ఉంచి బెదిరింపులకు పాల్పడటం వంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తీవ్ర అభద్రతా భావం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చోటుచేసుకుంటోంది. మరోవైపు ఈ రంగంలో తగ్గుతున్న ఉద్యోగాల ప్రభావం హైదరాబాద్, బెంగళూరు వంటి చోట్ల అనుబంధ రంగాలపై కూడా పడుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కంపెనీల లాభనష్టాల లెక్కలు ఎలా ఉన్నప్పటికీ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. విధి నిర్వహణకు అవసరమైన నైపుణ్యాల పెంపు బాధ్యతను సంస్థలే స్వీకరించాలి. ఆ సాకుతో ఉద్యోగాలను తొలగించడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ బతుకు లలో పెరుగుతున్న సంక్షోభంపై గళం విప్పాలి!

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# సమాజం కోసం తమ వంతుగా





వృత్తి బాధ్యతల్లో తలమునకలవుతున్నా కొంతమంది సమాజ సేవ కోసం ప్రత్యేక సమయం కేటాయిస్తారు. మానవతకు అద్దం పట్టే పనులు చేస్తారు. అలాంటి వారిలోని వారే ఈ ముగ్గురు వ్యక్తులు. తెలంగాణ ఆర్‌టిసిలో కండక్టర్, డ్రైవర్, స్టోర్ అటెండర్ బాధ్యతల్లో ఉన్న అనిత (48), సత్యనారాయణ (60), రాములు ఎవరికి వారే విశేష వ్యక్తిత్వం గలవారు. వారి సేవకి డిపార్ట్‌మెంట్ నుండే కాక, రాష్ట్ర ప్రభుత్వం నుండి క డా సత్కారాలు అందుకున్నారు. ఖమ్మం డిపోకి చెందిన పొద్దుటూరి అనిత, తలసేమియా బాధిత పిల్లల కోసం స్వయంగా ఒక సంస్థనే నడిపిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం తన జీవితంలో జరిగిన ఓ సంఘటన ఆమెని ఈ సేవకి సిద్ధం చేసింది. తలసేమియాకి గురైన తన బంధువుల బిడ్డని కాపాడుకునేందుకు ఆ కుటుంబం పడిన కష్టాలు ఆమె స్వయంగా చూసింది. 'ఆ సమయంలో నేను ఏమీ చేయలేకపోయాను. ఆ తల్లిదండ్రులను మాత్రం ఎప్పటికీ మర్చిపోలేను. అప్పుడే బిడ్డ ఆరోగ్యం కోసం ఏ కుటుంబం ఇంతలా బాధపడక డదని నిర్ణయించుకున్నాను' అని అనిత ఆ రోజులని గుర్తు చేసుకున్నారు. 2010లో అనిత, 'సంకల్ప్' పేరుతో ప్రారంభించిన సంస్థ ద్వారా వందలాది రక్తదాన శిబిరాలు నిర్వహించారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తం, ఔషధాలు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. తనకు చేదోడువాదోడుగా భర్త రవిచంద్ర క డా ఏకమయ్యారు. సంస్థ అందించే సాయంతో 248 చిన్నారులు తమ జీవితాలను బాగు చేసుకుంటున్నారు. ఆ పిల్లల బాగోగుల కోసం అనిత స్వయంగా వారు ఉండే గ్రామాలకు వెళ్లి మరీ సాయం చేస్తారు. సమయానికి రక్తమార్పిడి జరిగేలా చూస్తారు. పిల్లల వైద్యం కోసం తక్కువ ఖర్చుతో క డిన ఎముక మజ్జ మార్పిడి కోసం వివిధ ఆస్పత్రులతో చర్చలు జరపడం అనిత దినచర్యలో ఒకటి. ఆమె చేసిన సేవలకు ప్రతిఫలంగా ఇప్పటికి 12 మంది పిల్లలు కొత్త జీవితాన్ని పొందారు. నిధులు కొరత వచ్చినప్పుడు తన సొంత జీతం నుంచి ఖర్చు చేసేందుకు క డా అనిత వెనుకాడరు. కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్‌లో స్టోర్ అటెండర్‌గా పనిచేసే పుల్లె సత్యనారాయణ పగలంతా వర్క్‌షాప్‌లో పనులు చేస్తారు. సాయంత్రం అయ్యేసరికి తన మోపెడ్‌పై మొక్కల సంచులు పెట్టుకుని నగరం అంతా తిరుగుతారు. బాల్యం నుంచి మొక్కల నాటడం అభిరుచిగా పెట్టుకున్న సత్యనారాయణకి ఇప్పుడది దినచర్యగా మారింది. దత పదేళ్లలో లక్షకి పైగా మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతోనే అతని పని అయిపోదు. అవి చిగురించేంత వరకు బాధ్యత తీసుకుంటారు. స్వయంగా వాటికి నీళ్లు పోస్తారు. చుట్టూ డ్రిల్స్ అమరుస్తారు. ఇవన్నీ సొంత డబ్బులతోనే చేస్తారు. అతను నాటిన మొక్కలు ఇప్పుడు కరీంనగర్‌లో చాలాచోట్ల కనిపిస్తాయి. మొక్కల పెంపకం, పర్యావరణ సంరక్షణపై తన మోపెడ్‌పై లౌడ్‌స్పీకర్ ద్వారా ప్రచారం క డా చేస్తారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ డిపార్ట్‌మెంట్ డ్రైవర్ రాములు, పగలు విధుల్లో సాయంత్రాలు కళారంగ బాధ్యతల్లో తీరిక లేకుండా గడుపుతున్నారు. 2019లో మహాకవి సి నారాయణరెడ్డి పేరుతో కళాపీఠం ప్రారంభించారు. అందులో సాంస్కృతిక కార్యక్రమాలు, పలు సామాజిక సేవలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రతి ఏడాది వివిధ జిల్లాల నుంచి పది మంది కవులను సత్కరించడం విధిగా పెట్టుకున్నారు. అలాగే ఆర్టీసీ డ్రైవర్‌గా రిటైర్ అయి, యాక్సిడెంట్ ఫ్రీ హిస్టరీ వున్న వారిని ప్రత్యేకంగా సత్కరిస్తారు. ఈ ఏడాది జూన్‌లోనే సికింద్రాబాద్ డిపో నుంచి 11 మంది డ్రైవర్లని రవీంద్ర భారతిలో సత్కరించారు. రాములు గురించి ఇంతవరకు చెబితే సరిపోదు. కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళితే అంటే 2001లో తన సొంత జిల్లా నాగర్ కర్నూల్‌లోని రాచేపల్లి ప్రభుత్వ బడిని దత్తత తీసుకున్నారు. ఏడాదికి రెండు సార్లు బట్టలు, పుస్తకాలు, పంపిణీ చేస్తున్నారు.

## ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులు.. అడ్డగోలుగా వసూళ్లు..



హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా ఇతర ప్రొఫెషనల్ కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాలు ఉత్తుత్తి కొలమానాలను తలపిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన సవరణ నిబంధనలను పక్కనబెట్టి తూతూమంత్రం గా ఫీజులను నిర్ధారిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఫీజుల నిర్ధారణ కోసం సోమవారం నుంచి ప్రారంభమైన కాలేజీల పునర్విచారణ నామ్‌కేవాస్తేగా సాగుతుంది. ప్రభుత్వం సవరించిన నిబంధనల ప్రకారం కాలేజీల్లో ఏమున్నాయి ఏం లేవో తేల్చి ఫీజులను ఖరారు చేయకుండా కాలేజీలు ఇచ్చిన నివేదికలనే బేస్ చేసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులపై తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఎఎఫ్ఆర్‌సీ) పునర్విచారణ నుంచి ప్రారంభమైంది. మొత్తం 160 ఇంజినీరింగ్ కాలేజీల ను సెప్టెంబర్ 3 వరకు పునర్విచారణ చేయనున్నారు. అయితే తొలిరోజై 20 కాలేజీలను పిలువగా, అందులో 17 కాలేజీలను టీఎఎఫ్ఆర్‌సీ అధికారులు విచారించి నట్టు తెలిసింది. మరో మూడు కాలేజీలు గైర్హాజరయ్యాయి. విచారణకు పిలిచిన కాలేజీల ఫీజులపై ఎలాంటి విచారణ జరగలేదని పలు కాలేజీల యా జమాన్యాలు తెలిపాయి. అయితే ఆయా కా లేజీల నుంచి టీఎఎఫ్ఆర్‌సీ అధికారులు గతంలో సమర్పించిన ఆడిటింగ్ నివేదికలు అసలైనవేనని అఫిడవిట్లు తీసుకొని పంపించేశారు.ప్రొఫెషనల్ కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు ప్రభుత్వం జారీచేసిన నిబంధనలు

పక్కకేనన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ మార్గదర్శకాలు ఇప్పుడు వర్తించవని, వచ్చే బ్లాక్ (మూడేళ్లు) పీరియడ్‌కు వర్తిస్తాయని ఓ కీలక అధికారి పేర్కొన్నారు. మళ్లీ కోర్టు తీర్పు ఆధారంగా నడుచుకుంటామని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముందుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. దీంతో కాలేజీల యాజమాన్యాల్లో గందరగోళం తలెత్తనున్నది.అయితే ఇంత కసరత్తు చేసి ఏం ప్రయోజనమన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఫీజుల పెంపుపై సర్కారు ఇటీవలే కీలక ఆదేశాలిస్తూ జీవో నంబర్ –33ను జారీచేసింది. కళాశాలలు సమర్పించే అకౌంట్లతో పాటు, మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, కాలేజీ ర్యాంకింగ్, విద్యాప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ఫీజులను నిర్ధారించాలన్నది. కానీ అవేమీ పట్టించుకోకుండా కేవలం కాలేజీల నుంచి అఫిడవిట్లను మాత్రమే తీసుకుంటున్నారు.విద్యార్థుల హాజరు,

అకడమిక్ పనితీరు, ఫేషియల్ రికగ్నిషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు, రీసెర్చ్, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, రీసెర్చ్ ఆర్టికల్ల ప్రచురణ, అవార్డులు, ప్లేస్మెంట్స్, జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్ పరిశీలించిన తర్వాతే ఫీజులను నిర్ధారించాలన్నది. అకౌంట్స్, ఆడిటింగ్ నివేదికలు సరైనవేనని అఫిడవిట్ సమర్పించాలంది. తప్పులు లెక్కలు, సమర్పించిన కాలేజీలపై చట్టపరంగా చర్యలు తప్పవని జీవోలో హెచ్చరించింది. అయితే సోమవారం కాలేజీల నుంచి కేవలం అఫిడవిట్లు మాత్రమే తీసుకున్నట్టు తెలిసింది.

## భూసారాన్ని దెబ్బతీస్తున్న పాలిథిన్




భూసారాన్ని దెబ్బతీస్తున్న పాలిథిన్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో వాటి వినియోగాన్ని నియంత్రించలేక పోతున్నారు. ఇందుకు ఉద్యమ తరహా మార్పు అవసరమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

స్వచ్ఛభారత్ అమలు చేస్తున్నా గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిసేధం అమలు కాకపోవడంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. అయితే కరోనా ఎఫెక్ట్‌తో ప్రపంచం మొత్తంగా పర్యావరణహితంగా ప్లాస్టిక్ వాడకమూ తగ్గింది. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను జార విడుస్తున్న కారణంగా భూమిలో అవి కరగక కాలుష్యం ఏర్పడుతోంది. భూమిలో అది చేరి వాతావరణ కాలుష్యాన్నిపెంచుతోంది. కేన్సర్ వ్యాధి వ్యాప్తికి, వాతావరణం కాలుష్యానికి కారణమౌతున్న ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. గ్రామాల పరిధిలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుక పెరిగిపోతోంది. దీనికితోడు చెత్త శుద్ధి లోపించడంతో ప్రధాన రహదారుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పెళ్లిళ్లు, పండుగలు, పార్టీల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల ను వినియోగిస్తున్నారు. వినియోగం అనంతరం రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పడేసి చేతులు దులుపుకుంటున్నారు. వాతావరణాన్ని కలుషితం చేసి మన ప్రాణాలను హరిస్తున్నాయన్న విషయం గుర్తించ లేకపోతున్నాం.

గుట్టలు గుట్టలుగా పడిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి తింటున్న పశువులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, సీసాలను తరచూ వినియోగిస్తూ కేన్సర్ వ్యాధి సోకే లక్షణాలు అధికంగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలకు క డా సోకే అవకాశం అధిక శాతం ఉందని సూచిస్తున్నారు. వినియోగం విపరీతంగా పెరిగి పోవడంతో కాలువలు, డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాలు, డంపింగ్‌యార్డుల్లో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. డిస్పోజల్ వస్తువుల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. దీంతో పలువురు వ్యాపార స్తులు టన్నుల కొద్ది నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. పలువురు వ్యాపారులు షాపుల ముందు, ఆరుబయట గుట్టలుగా పేర్చి విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఆఖరకు కాఫీ హోటళ్లలో క డా ప్లేట్లలో అరటి, ఇతర ఆకులకు బదులుగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ఆహార పదార్థాలు ప్యాకింగ్‌కు సైతం వీటిని వాడుతున్నారు. పర్యావరణా నికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై జిల్లా కలెక్టర్ తహశీల్దార్లకు పూర్తి అధికారాలు ఇచ్చారు. అమ్మినా, కొనుగోలు చేసినా, వినియోగించినా, ఎక్కడబడితే అక్కడ వేసినా రూ.ఐదు వేల నుంచి రూ.25 వేల వరక జరిమానా విధిస్తారు. విక్రయ షాపులపై దాడులు చేసి వస్తువులను స్వాధీనం చేసుకోవడం, షాపులను సీజ్ చేయడం వారిపై కేసులు నమోదు చేసే అధికారం తహశీల్దార్లకు ఉంది. ముడుపులకు లొంగి చూసీ చూడనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో పేపర్ గ్లాసులు, పేపర్ కవర్లు, ప్లేట్లు దర్శనమిస్తున్నా వివాహాది శుభకార్యాల్లో క డా ఎలాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంటుంది. దీనిపై మరలా అధికారులు విస్తృత ప్రచారం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నా అమలు కావడం లేదు. అధికారుల ఉదాశీనత, వినియోగదారుల అవగాహనలేమితో విచ్చల విడిగా వినియోగం కొనసాగుతూనే ఉంది. దీంతో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎక్కడ చూసినా కాలువలు, డ్రెయిన్లు వీటితో నిండిపోతున్నాయి. హరిత ఉద్యమం లాగే ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంగా సాగితే తప్ప నిషేధం అమలు జరగదని అంటున్నారు.

## ఎన్నికల హామీలు గాలికి వదిలేసిన కాంగ్రెస్

### - బైక్ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్




**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 5( డీకే చాటింపు):**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆర్ గ్యారంటీలు 420 హామీలు ఏమయ్యాయని హామీలు గాలికి వదిలి గ్రూపు రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని నిజాంబాద్ నగర మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా దుయ్యబట్టారు. నగరంలో శనివారం మాజీఎమ్మెల్యే టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బిగాల గణేష్ గుప్త 1000 బైకులతో ర్యాలీ తీశారు. ప్రజల సమస్యలు గాలికి వదిలేసి ముఠాలు కొమ్మలాటలు తప్ప పదవి కాపాడుకోవడం తప్ప వేరే ధ్యాస లేదని అన్నారు. ప్రజల కష్టాలు కన్నీళ్లు తుడిచే నాయకుడిగా కెసిఆర్ ముందుంటారని మళ్లీ కెసిఆర్ ఏ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ప్రభుత్వ భూములు అమ్ముకోవడమే కాకుండా పట్టా భూములు కూడా అమ్ముకోనీయకుండా పేదలకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ధర్నాలలో భాగంగా నిజాంబాద్ నగరంలో పాత కలెక్టరేట్ నుంచి కులాంగ్ మీదుగా వర్ని చౌరస్తా నుండి బోధన్ రోడ్డు మీదుగా గాంధీ చౌక్ నుండి బస్టాండు మార్గంలో పాత కలెక్టరే గ్రౌండ్ కు బైక్ ర్యాలీ చేరుకుంది. ఈ బైక్ ర్యాలీలో మాజీ మేయర్ నీతి కిరణ్ ,నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి ,సుజిత్ సింగ్ తదితరులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన

**జనగాం సెప్టెంబర్ 5 డీకే చాటింపు** జిల్లా ప్రతినిధి జిల్లా కేంద్రమైన జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించే డబుల్ బెడ్‌రూం ఇళ్ల లక్కీ డ్రాను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన బాష్పాక కుమార్,పడమటింటి ఏసుపాదం లు జనగామ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని నెల్లుట్ల ఆర్టీసీ కాలనీలోని వాటర్ ట్యాంక్ ఎక్కి శనివారం ఆందోళనకు దిగారు. అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేస్తూ లాటరీ పద్ధతిలో ఇళ్లు కేటాయించడం సరైంది కాదని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రా ప్రక్రియను వెంటనే రద్దు చేసి, నేరుగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి క్షేత్రస్థాయి విచారణ ద్వారా నిజమైన అర్హులను గుర్తించి వారికి మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

## 6 న ఆదివారం గంగ . మరియు బోనాల మహోత్సవము 2026 శోభాయాత్ర

### - మాదన్నపేట, ఎల్బీనగర్ ఫిషర్స్ కో-ఆపరేటివ్ చైర్మన్ గంగపుత్ర భాస్కర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (డీకే చాటింపు)**తెలంగాణ గంగా తెప్పోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే గంగ . మరియు బోనాల మహోత్సవము- 2026 శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవ ంతం చేయాలని మాదన్నపేట ఎల్బీనగర్ ఫిషర్స్ కో-ఆపరేటివ్ చైర్మన్ గంగపుత్ర భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంగపుత్ర భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగ . మరియు బోనాల మహోత్సవము శోభాయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ శోభాయాత్ర లోని ఖైరతాబాద్ ఏడు గుళ్ళు నుండి ప్రారంభమై హుస్సేన్ సాగర్ చెరువు కోట వద్దకు చేరుకుంటుందని తెలియజేశారు

# భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా

### - ఉపాధ్యాయ దినోత్సవం మనందరిలో స్ఫూర్తి నింపాలి
### - కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి
### - టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు





**మహేశ్వరం, సెప్టెంబర్ 5 (డీకే చాటింపు)** సమాజానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా వారిని తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయుల పైన ఎంత గానో ఉంది అని కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి తెలి పారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేసిన కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి . ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ విలువలను బోధిస్తూ క్రమశిక్షణ నేర్పుతూ విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈరోజు ఉపాధ్యాయ దినోత్సవం మనందరిలో స్ఫూర్తి నింపాలి ఆదర్శ జీవితం గడిపి అత్యుత్త స్థానానికి వెళ్లిన ఆయనను భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని ఉన్నారు. విద్యార్థిని విద్యార్థులకు వారికి ఏ విధంగా బోధిస్తే అర్థం అవుతుందో తెలుసుకొని ఏ రంగాలపై విద్యార్థులు ఆసక్తి కనపడుతున్నారు వాటిపై వారికి మంచి విద్యను అందించాలి చదువు ఒక్కటే కాకుండా తల్లిదండ్రులు గౌరవించడం ఉపాధ్యాయులను గౌరవించడం సమాజానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా వారిని తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయుల పైన ఎంతగానో ఉంది అని తెలియజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో సెక్రటరీ హరినాథ్ రెడ్డి, ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి ప్రిన్సిపల్ రామస్వామి రెడ్డి మరియు హెచ్వోడీలు అధ్యాపకులు పాల్గొన్నారు

# విద్యార్థులు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### - ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
### -"విద్యార్థి, యువ పోరుబాట" కార్యక్రమం విజయవంతం



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 5( డీకే చాటింపు**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను, యువతకు ఇచ్చిన 420 హామీల అమలులో జరిగిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో "విద్యార్థి, యువ పోరుబాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని వీవీ నగర్ బస్‌స్టాప్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారి వరకు నిరుద్యోగ యువకులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే అమలు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భవాని ప్రవీణ్ కుమార్, సాగర్ రెడ్డి, , రమేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు బిచ్చేనేపల్లి వెంకటేశ్వరరావు, చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సొంటి చంద్రశేఖర్ రెడ్డి,శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, శైలజ, విజయ, గండిసన్ని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఎ సమస్య పరిష్కారం కోసం బీజేపీ యుద్ధం..!

### - పాల్గొన్న గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (డీకే చాటింపు)**భూ భారతి పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతుల భూములను సెక్షన్ 22-ఎ పరిధిలోకి తీసుకువచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామ్‌చందర్‌రావు గారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహా దీక్ష నిర్వహించారు. ఈ మహా దీక్షలో గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వారి వెంట గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పలువురు కాలనీ వాసులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. భూ భారతి పేరుతో పేదలు, రైతులు, మధ్యతరగతి ప్రజల భూములపై అనవసర ఆంక్షలు విధించి, వాటిని 22-ఎ పరిధిలోకి తీసుకురావడం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రజలు తమ సొంత భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం, రిజిస్ట్రేషన్ చేసుకోవడం వంటి విషయాల్లో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తి హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం, వారి భూములపై ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. పేదలు, రైతులు, మధ్యతరగతి ప్రజల భూముల హక్కులను హరించే ఎలాంటి విధానాలనైనా భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజల భూముల పరిరక్షణ కోసం, 22-ఎ సమస్యతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మె?

# అగ్రికల్చర్ కాలనీలో ఘనంగా గోకులాష్టమి వేడుకలు

### - టిటిడి హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోపూజ





**హైదరాబాద్, సెప్టెంబర్ 5, డీకే చాటింపు:**-హస్తినాపురం అగ్రికల్చర్ కాలని శ్రీరామాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా శ్రీ కృష్ణ భగవానుడికి ఘనంగా అత్యంత శ్రద్ధా భక్తులతో పూజలు వేద పండితులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తమ చిన్నారులను గోపాల బాల కృష్ణులు, గోపికల వేషధారణలతో తల్లి దండ్రులు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించడం జరిగింది తదుపరి గోపూజ కార్యక్రమంలో శ్రేష్టమైన పుంగనూరు గోవును లాగాను పూజించడం జరిగింది. గో ప్రదక్షిణ కార్యక్రమం గోవింద నామాలతో జై శ్రీరామ్ జై శ్రీకృష్ణా నామాలతో గుడి ప్రాంగణం మారు మ్రోగింది. అనంతరం ఉట్ల కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు టిటిడి హిందూధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ వారికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేశారు. కార్యక్రమం లో టిటిడి హిందూధర్మ ప్రచార పరిషత్ సభ్యులు టి సురేందర్, బుచ్చిరెడ్డి, చిన్నారెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత గుండె, హార్మోన్ వ్యాధుల పరీక్షా శిబిరం

**జనగామ సెప్టెంబర్ 5 డీకే చాటింపు** జిల్లా ప్రతినిధి జనగామ జిల్లా కేంద్రంలోని ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లో ఈ నెల 8 వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు లకు ఉచిత గుండె మరియు హార్మోన్ల సంబంధిత నిర్వహకులు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఏ.నాగుర్,హార్మోన్ వ్యాధుల వైద్య నిపుణులు డా.జి.సుదీప్ వారి బృందం పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని, బీపీ,ఇసిజి,2డి ఎకో స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నందున అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు కోరారు.ముందస్తుగా మీ పేరు నమోదు చేయడానికి డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కన్న పరశురాములు సెల్ నెంబర్ 9396723272 కు కాల్ చేసి తెలుప వచ్చునని వారు తెలిపారు.

# 22-ఎ బాధితులకు అండగా ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా విజయవంతం

### - నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్





**ఎల్బీనగర్, సెప్టెంబర్ 5 (డీకే చాటింపు)**తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు 22-ఎ నిషేధిత జాబితా కారణంగా తమ భూములు, ఆస్తులపై హక్కులు కోల్పోతున్న బాధితులకు అండగా ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి నాగోల్ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, 22-ఎ బాధితులు హాజరయ్యారు. 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను వెంటనే ఆ జాబితా నుంచి తొలగించి, బాధితులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా భూములను నమ్ముకొని జీవిస్తున్న ప్రజలు 22-ఎ నిబంధనల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. బాధితుల సమస్యలను పరిష్కరించే వరకు బీజేపీ పార్టీ వారి పక్షాన నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, 22-ఎ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ మహా ధర్నా కార్యక్రమంలో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ , జీఎస్ఐ డివిజన్ అధ్యక్షులు వినోద్ రెడ్డి , బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధాల ఐలయ్య, బద్దం బాలకృష్ణ గౌడ్, నరేందర్ రెడ్డి, కొండబత్తుల శ్రీనివాస్, సంజీవరెడ్డి, పంగ శ్యామ్, దయాకర్ రెడ్డి, బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులుసామిడి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో

### - ఘనంగా బైక్ ర్యాలీ మరియు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం





**మహేశ్వరం, సెప్టెంబర్ 5 (డీకే చాటింపు)**తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి , మాజీ. ఎమ్మెల్యే కిచన్న గారి లక్ష్మా రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర లో కాంగ్రెస్ పార్టీ 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన 1000 రోజులలి ప్రజాపాలనను పురస్కరించుకున మహేశ్వరం నియోజకవర్గం ప్రశాంత్ హిల్స్ డివిజన్ 58లో రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులుసామిడి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ మరియు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం మరియు సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కాల్వ సుజాత గుప్తాటీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథి గా హాజరై బైక్ ర్యాలీని ప్రారంభించారు. భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై ర్యాలీ నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 58డివిజన్ దీూా లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్నారు ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులు పేరుపేరున ధన్యవాదములు తెలిపారు సామిడి గోపాల్ రెడ్డి.

# బోయిన్ పల్లి తండాలో ఆంజనేయస్వామి జల్ది బిందె


### -కృష్ణా నది నుంచి పవిత్ర జలాలను గ్రామానికి తీసుకొచ్చి...
### -గ్రామంలో జల్ది బిందె ఊరేగింపు...
### -భక్తులకు అన్నదానం...



**నారాయణపేట,(డీకే చాటింపు):** నారాయణపేట మండలంబోయిన్ పల్లి తండాలో శనివారం ఆంజనేయస్వామి జల్ది బిందె కార్యక్రమం ఘనంగా జరిగింది. కృష్ణా నది నుండి పవిత్రమైన జలాలను తీసుకువచ్చి,సాకలి బీమప్ప బావి వద్ద జల్ది బిందెలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో జల్ది బిందెనుఘనంగా ఊరేగింపుతో గ్రామ ఆంజనేయస్వామి దేవాలయానికి చేర్చారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులతో బోయిన్ పల్లి తాండ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్,ఉప సర్పంచ్ రమేష్ నాయక్,వార్డు సభ్యులు దేవమ్మ,గంసు బాయి,కళ్యా నాయక్,మాజీ వార్డు సభ్యులు వెంకటేష్ నాయక్,జల్ది బిందె పూజారి లోక్య నాయక్,రాజేందర్, శంకర్,రవి నాయక్, హనుమంతు,కృష్ణ,చందర్ నాయక్,గోపాల్,మాజీ కో- ఆప్షన్ సభ్యులు పిత్య నాయక్,జేసీబీ కృష్ణ,గణేష్, నందు,గ్రామ పెద్దలు తుల్స్యా, కిష్త్య నాయక్,లోక్య నాయక్, మొత్య,సోమ్ల నాయక్, వెంకట్ నాయక్,మహిళలు హీరమ్మ ,నీలమ్మ,సుశీలమ్మ, బుగ్గమ్మ,నందమ్మ,సోనీ బాయి,లలిత, చంద్రమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బోధనలో మీ సేవా ద్వారా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా అరెస్ట్

**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 5 ( డీకే చాటింపు):**బోధన్ పట్టణంలోని సహారా మీ సేవ కేంద్రం నుండి అదిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను విశ్వసనీయ సమాచారమేరకు పట్టుకొని అరెస్టు చేసినట్లు నిజాంబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నకిలీ సర్టిఫికెట్ సభ్యులు షేక్ వసీం అహ్మద్ ముక్రం లను అరెస్ట్ చేశామని తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లు ముఠాను పట్టుకోవడంలో సహకరించిన నిజాంబాద్ సిసిఎస్ ఏసిపి శ్రీశైలం సిబ్బంది మరియు సిసిఎస్ పోలీస్ స్టేషన్ సిఐ అజయ్ ,ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రా,ములు, కానిస్టేబుల్ అనిల్ గంగా ప్రసాద్. మరియు బోధన్ సిఐ వెంకటనారాయణ ఎస్సై రామ్ పరిశోధించి నిందితులను అరెస్ట్ చేశారు. జనన ధ్రువీకరణ మ్యారేజ్ బోనఫైడ్ టీసి తదితర నక్లి సర్టిఫికెట్లు మరియు లాప్టాప్ ఇంటర్ లను స్వాధీనం చేసుకున్నారు అని తెలియజేశారు.



# కోటగిరిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 5 (డీకే చాటింపు):**మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన స్వామి పురస్కరించుకొని సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరపడం అంతేకాకుండా కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయు లందరికీ కిడ్స్ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. కోటగిరి హైస్కూల్లో పదవ తరగతి చదివిన 1973 74 బ్యాచ్ విద్యార్థులు అందరూ కలిసి ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. సన్మాన కార్యక్రమానికి ఏం ఈఓ శ్రీనివాసరావు ,కిడ్స్ అధ్యక్షులు పోలా విటల్ రావు గంగాధర్ గౌడ్ ,బర్ల సత్యనారాయణ, ధన్పాల్ లక్ష్మీ నరసింహులు విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు ,డిగ్రీ కళాశాల మా జాతీయతకులు అనంతరావు, తదితరులు తమ గురువులందరికి సన్మానం చేశారు.



# పిఠాపురంలో రోడ్లకు మహర్దశ



**కాకినాడ, :** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కి, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్ణీత లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది. రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి-రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గం సుగమమైంది. సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం-ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు దశాబ్దాలుగా గుంతలమయమై నరకప్రాయంగా మారిన గొల్లప్రోలు మండలం వెన్నెపూడి జీఎన్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు-తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు. వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఉన్న డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్లు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి. అభివృద్ధి పనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు

# జనాలు ఓట్లు రాలుస్తాయా.....



**విజయవాడ, :** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటనలు ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే మారుతుంటాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున ప్రజలు కనిపించడం సహజమే. గతంలో పార్టీ నాయకులు ప్రత్యేకంగా జనసమీకరణ చేపట్టేవారనే విమర్శలు వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. జగన్ పర్యటనలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఎవరినీ ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం లేదని వారు వాదిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన పర్యటనల్లో కనిపించిన జనసందోహాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. అయితే ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా రాజకీయ విశ్లేషకులు పరిశీలిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు రావడం రాజకీయంగా బలం చూపించినా, భద్రతా పరంగా మాత్రం సవాళ్లు పెంచుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. భారీగా ప్రజలు చేరడం వల్ల తొక్కిసలాటలు, ఆస్తి నష్టం లేదా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సంఘటనలు భవిష్యత్తులో రాజకీయంగానే కాకుండా చట్టపరంగానూ ఇబ్బందులు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పర్యటన సందర్భంగా ఒక మహిళకు చెందిన దుకాణం దెబ్బతినడం, పొగాకు బేళ్లపై కొందరు ఎక్కి తొక్కడం వంటి ఘటనలు చర్చకు వచ్చాయి. అలాగే శ్రీకాకుళం జిల్లాలో మహిళా ఎస్సై విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన తోపులాట కూడా వివాదాస్పదమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలు, వివరాలను అధికార వర్గాలు ప్రత్యర్థి పార్టీ నాయకులు నమోదు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. గతంలో గుంటూరు జిల్లాలో జరిగిన మరో ఘటన కూడా తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఒక పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సమయంలో జరిగిన రద్దీలో మరో కార్యకర్త వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు రాజకీయ కార్యక్రమాల్లో భద్రత ఎంత ముఖ్యమో గుర్తు చేస్తున్నాయి. ఇదే తరహా ఘటనలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. తమిళనాడులో విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కూడా భారీ జనసందోహం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. బీహార్ లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర సందర్భంగా భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సభలు, ర్యాలీలు, పాదయాత్రల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలపై ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశముంది. భవిష్యత్తులో జగన్ చేపట్టే పాదయాత్ర లేదా ఇతర భారీ కార్యక్రమాలకు అనుమతులు, భద్రతా నిబంధనల విషయంలో మరింత కఠినమైన షరతులు విధించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ బలం చూపించడమే కాకుండా ప్రజల భద్రతను కాపాడటం కూడా అన్ని పార్టీల ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### జైలు కెళ్తే టిక్కెట్ గ్యారంటీ

వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు. వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది. ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్సైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలసి వచ్చింది అని అంటున్నారు.

# జనసేన పవర్ ఫుల్ ప్లాన్




**విజయవాడ, :** జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైలెంట్ గా తన పని తాను చేసుకుని పోతున్నారు. ఒక వైపు పార్టీ అధినేతగా జనసేనను సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రిగా తన దగ్గర ఉన్న ప్రాధాన్యత కలిగిన శాఖలను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పనితీరులో మెరుగుదల చూపిస్తున్నారు. అటవీ శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలలో రోడ్లు వేయించి అడవి తల్లి బాట పేరుతో వారికి దారి చూపిస్తున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పనిలో పనిగా పర్యావరణ శాఖ మీద కూడా ఆయన దృష్టి పెట్టారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయిన పంచదార్ల వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందని తెలిసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలని కూడా సూచించారు. ఇక పార్టీ పరంగా చూస్తే పవన్ కళ్యాణ్ బూత్ లెవెల్ నుంచి జనసేనను పటిష్టం చేసే కార్యక్రమం ముమ్మరం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికే పెద్ద పీట వేస్తున్నారు. అంతే కాక వారు జనసేనలో ఏళ్ళ తరబడి పనిచేసేలా ఉండడమే అర్హతగా చూసుకుంటున్నారు. రేపు జరిగే స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎత్తిన వారికే సీట్లు అన్న విధానం కూడా తీసుకుని రావాలని చూస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ విధంగా జనసేనను నమ్ముకుంటే తమకు న్యాయం జరిగింది అన్నది పార్టీ క్యాడర్ అంతా అనుకుని సుదీర్ఘ కాలం పాటు గట్టిగా నిలబడేలా జనసేన అధినాయకత్వం పక్కాగా ప్రణాళికలను రచిస్తోంది అని అంటున్నారు. ఇక దైనందిన విషయాల్లో ప్రత్యర్థుల మీద విమర్శలు ఉంటూ ఉంటాయి. వైసీపీ మీద ప్రతీ రోజూ విమర్శలు చేసే విధానానికి జనసేన దూరంగా ఉంటోంది. అందుకే ఆ పార్టీ తన లక్ష్యాలను ఏమిటో నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా ముందుకు సాగుతోంది అని అంటున్నారు. వారిని వీరు వీరిని వారు విమర్శించుకోవడం వల్ల ఉపయోగం లేదని మీడియాలో హైప్ క్రియేట్ కావడం తప్ప గ్రౌండ్ లెవెల్ లో ఏమీ ఉండదని జనసేన భావిస్తోంది. అందుకే జనసేన ఈ తరహా విమర్శల రాజకీయానికి దూరంగా ఉంటోంది అని అంటున్నారు. ఇక జనసేన 2029 ఎన్నికల మీదనే తన చూపు నిలిపింది అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు పొత్తులో భాగంగా కోరాలీ అంటే ముందు పార్టీగా బలపడాల్సిన అవసరం ఉందని జనసేన నమ్ముతోంది. పార్టీకి బూత్ లెవెల్ నుంచి క్యాడర్ అలాగే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలతో పాటు నియోజకవర్గాన్ని నడిపించే బలమైన నాయకత్వం ఉంటే కచ్చితంగా ఎక్కువ సీట్లు తీసుకోవచ్చు అని భావిస్తోంది. వచ్చే ఎన్నికలు జనసేనకు ఒక విధంగా కీలకం అని అంటున్నారు. ఎక్కువ సీట్లు తీసుకుని 2024 మాదిరిగానే సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో గెలిస్తే కచ్చితంగా ఆ తరువాత ఏర్పడే ప్రభుత్వంలో ముఖ్యమైన పాత్ర పోషించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తోంది అని అంటున్నారు. మొత్తానికి జనసేన దీర్ఘ కాలం ఆలోచనలు చేస్తోంది. అందుకే సైలెంట్ గానే పవన్ తన పని ఏంటో చేసుకుని పోతున్నారు అని అంటున్నారు.

# రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు



**విశాఖపట్టణం, ,** కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత జిల్లాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీకాలం పూర్తి అయిన తర్వాత కొత్త జిల్లాపరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త జిల్లా పరిషత్‌ల ఏర్పాటుపై రాష్టంలోని అన్ని జిల్లా పరిషత్ సీఈవోలతో ప్రభుత్వం సమావేశం కానుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే, రాబోయే నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత, 2022 ఏప్రిల్‌లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, పరిపాలనాపరమైన ఇబ్బందులను నివారించడానికి, అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ మండళ్లు.. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తమ కార్యకలాపాలను కొనసాగించాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారు. మరోవైపు కొత్త జిల్లాల కోసం ప్రత్యేక జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేక కార్యాలయ భవనాలను సమకూర్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తోంది. విశాఖపట్నం జిల్లా పరిషత్ మూడు జిల్లా పరిషత్‌లుగా.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజుగా విభజించనున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనం నుంచే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది. విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో సుమారు 60 శాతం మందిని 24 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు, 30 శాతం మందిని 11 మండలాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 10 శాతం మందిని కేవలం నాలుగు మండలాలు మాత్రమే ఉన్న విశాఖపట్నం జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల యంత్రాంగాలు ఇప్పటికే కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాల కోసం తగిన భవనాలను, స్థలాలను గుర్తించాయి. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత కేబినెట్‌మంత్రులు మౌనంగా ఉంటే సహించేది లేదని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ముఖ్యంగా టీడీపీ మంత్రులకు ఆయన ఈ విషయంలో ఇప్పటికే చాలా సార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చాలా మంది మంత్రులు మౌనంగా ఉండడం.. కనీసం పన్నెత్తు విమర్శ కూడా చేయకపోవడంతో సీఎం మరోసారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే టెలీ కాన్ఫరెన్సు నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మంత్రులకు వారి బాధ్యతలను గుర్తు చేసినట్టు తెలిసింది. ఫైళ్ల క్లియరెన్సు, శాఖలపై పట్టు విషయంలో రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఐదుగురు టీడీపీ మంత్రులు పట్టు పెంచుకోలేక పోయారని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇక, ప్రత్యర్థులు చేస్తున్న దాడిని ఎదుర్కొనడంలో దాదాపు సగం మంది మౌనంగానే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా.. ప్రతి విషయాన్నీ తాను చెప్పాలంటే కుదరదని.. ఇక నుంచి అయినా.. మిషన్ మోడ్‌తో పనిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు రెచ్చిపోతున్నా.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఇక, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్క చోట కూడా.. కూటమి పార్టీలు ఓటమి చవి చూడకూడదని స్పష్టం చేశారు. ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అదే సమయంలో మీడియా ముందుకు రావడం.. ప్రజలకు మంచిని వివరించడం చేయాలని చెప్పారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా.. దాని తాలూకు ఫలితం ఓట్ల రూపంలో మారకపోతే.. ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తానే స్వయంగా మంత్రుల పనితీరును పరిశీలించనున్నట్టు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లాల ఇంచార్జ్ మంత్రులు.. అసలు జిల్లాల్లో పర్యటించడం లేదని తనకు నివేదికలు అందాయన్నారు. ముఖ్యంగా అంతర్గత పోరును తగ్గించాలని చెబుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇది సరికాదన్న ఆయన 'పనితీరు మెరుగు పరుచుకోని వారు.. ఆలోచన చేసుకోవాలి" అని పరోక్షంగా హెచ్చరించారు. వచ్చే స్థానిక ఎన్నికల తర్వాత.. ఫలితాన్ని బట్టి మార్పులు ఉండే అవకాశం ఉందని ఆయన పరోక్షంగా మంత్రి వర్గ ప్రక్షాళనపై సంకేతాలు ఇచ్చేశారు.

# ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్



**ఒంగోలు, :** ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్మ రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నులు వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు. ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం పండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది బంగినపల్లి దిగుబడి బావుంది.. కానీ ధరలు మాత్రం లేవు. సీజన్ ముగిసే సమయంలో టన్ను రూ.60వేలు కూడా పలకలేదు. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రాలేదని నిరాశ చెందారు.. ఈసారి పునాస రకం మామిడి కాయలకు మంచి ధర రావడంతో ఆ నష్టాల నుంచి కాస్త బయటపడతామని చెబుతున్నారు.

# వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

**విజయవాడ, ఆగస్టు 5 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. కపిల్ సాహు టీం ఇప్పటికే ఏపీ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని అంటున్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా విపరీతమైన జనం రావడం, టూర్ ఆలస్యమవ్వడం వ్యూహకర్త వ్యూహంలో భాగమేనని అంటున్నారు. అయితే ఈ పేరు అధికారికంగా బయటకు రాకపోయినా అనధికారికంగా కపిల్ సాహు డ్యూటీలోకి దిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. టీవీకే అధినేత విజయ్ ఎన్నికల వ్యూహకర్త గా కపిల్ సాహు వ్యవహరించారు. ఆయన ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బృందంలో పనిచేసి, ఆ తర్వాత సొంతంగా 'పొలిటికల్ కన్సల్టింగ్ డొమైన్' అనే సంస్థను ఏర్పాటు చేసి విజయ్ పార్టీ టీవీకే విజయం కోసం పనిచేశారు.

# మళ్లీ జలజగడం

హైదరాబాద్, ,తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది.తెలంగాణ చరిత్ర తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు. సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు, బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి.పక్క రాష్ట్రాల



ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ప్రారంభాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక శక్తిగా ఉంటాయి.నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందనే చిన్న సంకేతం కూడా తెలంగాణలో వెంటనే బలమైన రాజకీయ వ్యతిరేకతను, సెంటిమెంట్‌ను రగిలిస్తుంది. మరి ఈ సెంటిమెంట్ ఎప్పటి వరకూ కొనసాగిస్తారో.. ఎవరు అధిగమించి అధికారాన్ని చేపడతారో చూడాల్సి ఉంది.

# బీజేపీతో మళ్లీ పొత్తుకు శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రయత్నాలు

ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోదీ సర్కారు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది. అయితే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మెజార్టీ సాధించలేక వీగిపోయింది. దీంతో మరోసారి ఈ బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మద్దతు కూడగట్టి, ఎలాగైనా గట్టిక్కించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే బిల్లుకు తాజాగా ఎస్ఏడీ మద్దతు ప్రకటించింది.బీజేపీ, అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తుందనే ఊహాగానాల నడుమ కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పంజాబ్‌కు చెందిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భేటీ అయిన మర్నాడే ఈ ప్రకటన వెలువడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అకాలీదళ్.. బీజేపీ కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఈ నిర్ణయం స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది.కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రణాళికను సమర్థిస్తూ.. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని బాదల్ శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్ఏడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. "చండీగఢ్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాం.. మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుంచి శిరోమణి అకాలీదళ్ స్ఫూర్తి పొందుతుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచింది. పార్లమెంట్ ముందుకు వచ్చిన కీలక అంశాలపై చర్చించిన అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన డిలిమిటేషన్ జరగాలని భావిస్తున్నాం. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'అన్ని రాష్ట్రాల్లో 50% స్థానాల సమాన పెంపు' ప్రతిపాదనకు మేము మద్దతు ఇస్తున్నాం' అని బాదల్ వెల్లడించారు. ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టినప్పుడు అకాలీదళ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించి,



ప్రతిపక్షాలతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్‌కు తక్కువ స్థానాలు పెరుగుతాయని, ఇది పంజాబ్‌కు వివక్షపూరితమైనదని అప్పట్లో పేర్కొంది. కానీ, ఇప్పుడు పొత్తు చర్చలు వేగం పుంజుకోవడంతో 50% స్థానాల పెంపు హామీతో ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.2020లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలతో బీజేపీ, అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల బంధం తెగిపోయింది. ఆ సమయంలో ఎన్డీయే కూటమి నుంచి అకాలీదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది.పార్లమెంట్‌లో ప్రధానితో బాదల్ శుక్రవారం భేటీ కావడంతో కూటమి పునరుద్ధరణపై ప్రచారం మొదలైంది. పంజాబ్ బీజేపీ వర్గాలు, ఎస్ఏడి, ఆర్ఎస్ఎస్‌లతో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు కూడా పొత్తుకు అనుకూలంగా ఉన్నారు. దీనిపై బీజేపీ కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా.. బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన పొత్తు ఉండాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వంటి వివరాలను తర్వాత చర్చించవచ్చని, పంజాబ్ పరిస్థితులను మెరుగుపరచడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అని అకాలీదళ్ నేతలు చెబుతున్నారు

# రెంట్ బాయ్‌ఫ్రెండ్ తో జరాభద్రం



హైదరాబాద్, ,సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సోషల్ మీడియాలో జరుగుతున్న మరో మోసంపై యువతను అప్రమత్తం చేశారు. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో నెట్టింట జరుగుతున్న ప్రచారం వెనుక ఉన్న మోసాలను వివరిస్తూ అమ్మాయిలు, యువతులను అలర్ట్ చేశారు. ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు పెట్టి, అమ్మాయిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇలాంటి కేటుగాళ్ల వలలో పడొద్దంటూ హెచ్చరించారు. ఇలాంటి మోసాలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియాలో జరిగే మోసాల నుంచి సైబర్ నేరాల వరకూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. ముఖ్యంగా యువతీ, యువకులు మోసాలకు గురికాకుండా సోషల్ మీడియా ద్వారావారిని అలర్ట్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే రెంట్ బాయ్‌ఫ్రెండ్ పేరుతో నెట్టింట జరుగుతున్న మోసాలపై మరోసారి యువతను అప్రమత్తం చేశారాయన. ఆగస్ట్ నెలలో రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు వల వేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. అలర్ట్‌గా ఉండాలని అమ్మాయిలకు సూచించారు.ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో అంటూ సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపించే పోస్టర్ల వెనుక సైబర్ మోసం దాగి ఉందని.. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇదంటూ సజ్జనార్ హెచ్చరించారు. ఫేస్ బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లోఆకర్షణీయంగా ఉండే అబ్బాయిల ఫోటోలను చూపిస్తూ.. కాఫీ మీటింగ్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లు, ఫుల్ డే ప్యాకేజీ అంటూ కేటుగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. గోప్యత, భద్రత పాటిస్తామని, అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతూ నెట్టింట ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ వివరించారు."ఏఐతో సృష్టించిన, ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తారు. ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది." అని సజ్జనార్‌యువతులు, అమ్మాయిలను అప్రమత్తం చేశారు.సోషల్ మీడి యాలో జరుగుతున్న ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందని.. వీటికి బాధ్యులైన వారిపై వేగంగా దర్యాప్తు చేసి.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీసీ సజ్జనార్‌స్పష్టం చేశారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటుగా, వారి తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? బయట ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.సోషల్ మీడియాలో ఇలాంటి కేటుగాళ్లు ఇచ్చే డిస్కౌంట్ ఆఫర్లను చూసి మోసపోవద్దని.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, కలవడం కానీ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ కేటుగాళ్ల బారినపడినా, లేదా అనుమానాస్పద పోస్టులు గమనిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కి కాల్ చేయాలని.. లేదంటే ఇఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు.

# బీసీల సెంట్రిక్‌గా కవిత




హైదరాబాద్, , తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న మాజీ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత.. ఇప్పుడు వ్యూహం మార్చుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ సెంటిమెంటు, ఉద్యమ కారులు.. వారి హక్కులు, ఉద్యోగాలు అంటూ.. రాజకీయ నినాదాలు చేసిన కవిత.. వీటి వల్ల వర్కవుట్ కాదని అర్థం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె.. తన పంథాను సమూలంగా మార్చుకు న్నట్టు కనిపిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో బీసీ సామాజిక వర్గం అధికారిక లెక్కల ప్రకారం.. 43 శాతం మంది ఉన్నారు. అనధికారికంగా 50 శాతం వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీలను తనవైపు తిప్పుకునే దిశగా కవిత రాజకీయాలకు పదును పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ ఓటు బ్యాంకు నికరంగా ఎవరికీ ఎడాప్ట్ కాలేదు. బీఆర్ఎస్ అయినా.. బీసీ గణనను తొలిసారి నిర్వహించామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకైనా బీసీలు పూర్తిగా అంకితం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు కవిత ప్రయత్నం చేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే బీసీల హక్కుల సాధన, ఏపీలో చేస్తున్న బీసీల రక్షణ హక్కు చట్టం తరహాలో తెలంగాణలోనూ బీసీలకు రక్షణ హక్కు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. రాజకీయంగా అదేవిధంగా రాజ్యాంగ పరంగా కూడా.. బీసీలకు 50 శాతం పదవులు కేటాయించాలని కోరుతున్నారు. వాస్తవానికి కవిత బీసీ కాకపోయినా.. ఆ వర్గాన్ని తనదైన శైలిలో తనవైపు తిప్పుకొనేందుకు బీసీల సమస్యలను భుజాని వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం నినాదాలకే పరిమితం కారాదని కూడా కవిత నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీల కోసం ఉద్యమం చేయాలనే దిశగా కవిత ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంటు నుంచే ఆమె పని ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించిన తరహాలో బీసీల కోసం.. వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించి.. ఢిల్లీ నుంచే తన వ్యూహాన్ని పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రస్తుతం కవిత కసరత్తు చేస్తున్నారు. ఇది అయిన తర్వాత.. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కోసం ఉద్యమం నిర్మించి.. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలనినిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇది ఏమేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.

# 95 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటికే తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా సదుపాయాలు కల్పించారు.తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో పాఠశాలకు భూమి, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చు కానుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు.95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది.ఈ పాఠశాలలకు అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం




ఏఐఐబీ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారీగా రుణాలు సమీకరించే ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనుంది. రుణం అందడంలో ఆలస్యం ఏర్పడినా పనులు ఆగిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఏఐఐబీ తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అమలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రమాణాలపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. తరగతి గదులతోపాటు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడంతోపాటు పాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# నెల్లూరు జిల్లాల్లోనే ఓట్లు మిస్..!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో ఏకంగా 44.89 లక్షల ఓటర్లు అంటే సుమారు 10.8 శాతం ఓటర్ల పేర్లను అధికారులు ముసాయిదా జాబితాలో అన్ కలెక్టబుల్ కేటగిరీ కింద తొలగించేందుకు సిద్ధం చేశారు. జులై 31న విడుదలైన ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.71 కోట్లకు పడిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర అలజడి రేపుతోంది.ఈ భారీ ఓట్ల గల్లంతు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. 15.22 లక్షల మంది మరణించిన వారు కాగా, 22.99 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారు లేదా ఫారమ్‌లు సమర్పించని అన్ కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నారు. మరో 7.37 లక్షల ఓట్లను ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డూప్లికేట్ ఓట్లుగా అధికారులు వర్గీకరించారు. ముఖ్యంగా రాయలసీమ , కోస్తా జిల్లాల్లో ఓట్ల రద్దు అత్యధికంగా నమోదైంది. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.91 లక్షల ఓట్లు, తిరుపతి జిల్లాలో 2.88 లక్షలు, కర్నూలులో 2.74 లక్షలు, అనంతపురంలో 2.48 లక్షలు, వైఎస్సార్ కడపలో 2.45 లక్షలు, విశాఖపట్నంలో 2.39 లక్షల ఓట్లు తొలగింపు లిస్టులోకి వెళ్లాయి.ఈ భారీ ప్రక్రియ వెనుక అసలేం జరుగుతోంది.. వీరంతా ఎటు పోయారనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తి రేపుతోంది. ఉపాధి, విద్య, వ్యాపార రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లేదా ఇతర నగరాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు క్షేత్రస్థాయి రీ-వెరిఫికేషన్ సమయంలో లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయ నష్ట కోణంలో చూస్తే, ఈ ఓట్ల గల్లంతు ప్రభావం రెండు ప్రధాన పార్టీలపై పడే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ సొంత ఊళ్లకు వచ్చి ఓటేసే మైగ్రెంట్ ఓటర్లు వైఎస్సార్‌సీపీ లేదా టీడీపీ మద్దతుదారులనే లెక్కలు పార్టీల వద్ద ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తమ మద్దతుదారుల పేర్లు పొరపాటున ఈ



44 లక్షల జాబితాలో చేరాయేమోనని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల వేళ ఈ ఓట్ల వ్యత్యాసం గెలుపోటములను శాసించే స్థాయిలో ఉంది.ఎన్నికల సంఘం, సీఈఓ వివేక్ యాదవ్ స్పష్టం చేసిన దాని ప్రకారం, ఇది కేవలం ముసాయిదా మాత్రమే. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు హక్కునూ నోటీసు, విచారణ లేకుండా తొలగించబోమని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆగస్టు నెల అంతా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నడుస్తోంది. తమ పేరు పొరపాటున గల్లంతైతే ఫారమ్-6 సమర్పించి, సరైన ఆధారాలు చూపిస్తే అక్టోబర్ 3న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో మళ్లీ పేరు చేరుతుందని ఈసీ వెల్లడించింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో గ్రామీణ మరియు పట్టణ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను అలర్ట్ చేసిన కూటమి, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి నియోజకవర్గంలో రద్దయిన ఓట్ల జాబితాను రీ-వెరిఫై చేసే పనిలో పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ విలువైనదే అయినందున, అసలైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చూసేందుకు పొలిటికల్ పార్టీలు డిజిటల్ క్యాంపెయిన్లు, డోర్-టు-డోర్ వెరిఫికేషన్లను ముమ్మరం చేశాయి.

# ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ దయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ - టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ దయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయులను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

# వ్యర్థం కాదు.. బలం!



చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!. %శ్రీ%
ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి. మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పొదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20 - 30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి. అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

అధిక బరువు తగ్గుతారు..: వాల్ నట్స్‌లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది.

చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

కండరాల పనితీరుకు..: వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తింటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?





## అనేక వ్యాధులు నయమవుతాయి..!

ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది. దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ మొక్క తీగ జాతికి చెందినది.

మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక వ్యవస్థకు..: తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. ఈ విధంగా తయారు చేసిన తిప్పతీగ మిశ్రమాన్ని తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల అనేక ఔషధ గుణాలు లభిస్తాయి. అనేక రోగాలను తగ్గించుకోవచ్చు. దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఎలాంటి రోగం అయినా సరే తగ్గిపోతుంది.

కీళ్లు, మోకాళ్ల నొప్పులకు..: తిప్పతీగ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల సమస్యతో బాధపడుతున్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తాగితే ఫలితం ఉంటుంది. ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే మోకాళ్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు ఉండవు. అలాగే కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

దయాబెటిస్ అదుపులో..: తిప్పతీగలో షుగర్‌ను తగ్గించే గుణాలు ఉంటాయి. అలాగే ఈ మిశ్రమంలో కలిపిన అన్ని పదార్థాలు కూడా షుగర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. కనుక దయాబెటిస్ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ సేవిస్తుంటే షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. దీంతో దయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తిప్పతీగ, పసుపులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే మొటిమలు, వాపులు తగ్గుతాయి. ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తుంది. చర్మం మృదువుగా కూడా ఉంటుంది. ఈ మిశ్రమం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ మీరు ఏదైనా వ్యాధికి మందులను వాడుతుంటే ఆయుర్వేద వైద్యులను సంప్రదించి దీన్ని వాడడం ఉత్తమం. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది.

# అందానికి ఆహారం



అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే



ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%శా%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శ్వపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# సోప్ నెయిల్స్ చూశారా?!




నో మేకప్ లుక్ ఇప్పుడు ట్రెండింగ్. ఇంతకు మునుపులా లేయర్లు లేయర్లు మేకప్ వేసుకుని హీరోయిన్‌లా కనిపించాలన్న ట్రెండు పోయి, హీరోయిన్లు కూడా మేకప్ లేకుండా కనిపించాలనుకునే రోజులు వచ్చాయి. మనిషి ఎంత నేచురల్‌గా కనిపిస్తే అంత అందం అన్నట్టు భావిస్తున్నారిప్పుడు. గోళ్ల విషయంలోనూ అచ్చం అదే పోకడ వచ్చింది. 'సోప్ నెయిల్స్' ఫ్యాషన్ మనకు ఆ విషయాన్నే చెబుతుంది. చూడగానే లేత గులాబీ రంగులో, తెల్లగా, ఆరోగ్యంగా, అప్పుడే మెనిక్యూర్ చేసిన గోళ్లలా శుభ్రంగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఇందుకోసం లేత రంగుల్లో (న్యూడ్ షేడ్స్) ఉండే మ్యాటీ ఫినిష్ గోళ్ల రంగుల్ని ఎంచుకుంటున్నారు. పైన గాజులా కనిపించాలనుకుంటే గ్లాసీ ఫినిష్ కోట్‌కు ఓటు వేస్తున్నారు. కొంతమంది సబ్బు నురగల్ని పోలినట్టు లైట్‌గా కోట్‌ను వేస్తున్నారు. ఫేక్ నెయిల్స్ అదేనండీ ఆర్టిఫీషియల్ గోళ్లు పెట్టుకున్నా వాటిని ఇలాగే సింపుల్‌గా కనిపించేలా ముస్తాబు చేస్తున్నారు. ఫ్యాషన్ లేదా సింపుల్ లుక్ ఏదైనా అప్పుడే స్నానం చేసినట్టు శుభ్రంగా కనిపించే ఈ గోళ్లు చక్కగా సరిపోతాయి. ఆరోగ్యమే అసలైన అందం మరి అంటున్నాయన్న మాట ఈ ట్రెండింగ్ సోప్ నెయిల్స్!

# 'బరువెక్కుతున్న' భారత్



భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.

# రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రామాయణ









బాలీవుడ్ నుంచి మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో ఒకటి రామాయణ దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం 45కి పైగా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతు న్నారు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు సన్నీడియోల్. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోల్ చాలా సరదాగా అల్లరిగా ఉండడంతో పాటు-ఉత్సహాంగా ఉంటుందని సన్నీ తెలిపాడు. నా పాత్రకు సంబంధించి త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాలుతో కూడుకున్నవని అందులో పూర్తిగా లీనమై నటించాలని సన్నీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచడానికి చిత్రబృందం నిరంతరం శ్రమిస్తోందని ఆయన తెలిపారు. హాలీవుడ్ సినిమాల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను రూపొందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని ఎన్నిసార్లు తెరకెక్కించినా కొత్తగానే ఉంటుందని, ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పతనాన్ని మరోసారి తెలుసుకుంటుందని సన్నీ డియోల్ ధీమా వ్యక్తం చేశారు

# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా









మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈసినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలి మెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎం దుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ - త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

# మహేష్-రాజమౌళి సినిమాలో సరికొత్త టెక్నాలజీ..?





దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. SSMB%29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ - రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్‌ని పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. అయితే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో రాజమౌళి బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ సినిమా షూటింగ్‌ను కెన్యాలోని నేషనల్ పార్క్‌లలో చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాజమౌళి కూడా అక్కడి లోకేషన్‌లను జల్లెడ పట్టి వచ్చాడు. అయితే ప్రస్తుతం కెన్యాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ ప్లాన్ మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, రాజమౌళి కెన్యాకు బదులుగా టాంజానియాలోని సెరెంగెటి అడవుల్లో షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రంలో బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఆఫ్రికా అడవులను గ్రాఫిక్స్ ద్వారా రూపొందించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ రెండు విషయాలపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదు..



మహిళలశరీరాకృతి ఎప్పుడూ ఒకేలాఉండదని,ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు. చిరంజీవి సినిమాలో ఐటెం సాంగ్..!: ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిరంజీవి లేటెస్ట్ మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు'లో స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని సమాచారం.


# వెంకటరమణ నేపథ్యమంతా విశాఖ!





విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రానికి సన్నాహాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. వెంకీ-గురూజీ మార్క్ చిత్రంగా మలుస్తున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ లో వెంకటేష్ కున్న ఇమేజ్ ఆధారంగానే త్రివిక్రమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనింగ్ కథను రాసినట్లు వినిపిస్తుంది. 'వెంకటరమణ' అనే టైటిల్ కూడా ఫిక్సైందని సమాచారం. ఈ కథ పూర్తిగా విశాఖపట్టణం నేపథ్యంలోనే సాగుతుందిట. విశాఖలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ఓ 50 ఏళ్ల వ్యక్తి కథగా ఆవిష్కరిస్తున్నారట. కుటుంబ అనుంబంధాల నేపథ్యానికి త్రివిక్రమ్ మార్క్ హాస్యాన్ని జోడించి సిద్దం చేసిన స్క్రిప్ట్ అని తెలిసింది. విశాఖ-అనకాపల్లి ప్రాంతాలతో తనకున్న అనుబంధాన్ని గురూజీ ఈ కథలో హైలైట్ చేయబోయ బోతున్నారట. త్రివిక్రమ్ అంటే బలమైన డైలాగులు...బంధాలు.. భావోద్వేగంతో కథను నడిపించ గల దిట్ట. ఇలాంటి కథలు రాయడం కొట్టిన పిండి. 'అతడు', ' అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అఆ', 'అరవింద సమేత', 'అల వైకుంఠపురములో' లాంటి చిత్రాల్లో ఎమోషన్ పాతతే అయినా తనదైన ట్రీట్ మెంట్ తో రక్తి కట్టించారు.

# ఎట్టకేలకు అసలు విషయం బయటపెట్టిన సింగర్



బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ మళ్ళీ వార్తల్లో నిలిచింది. ఈసారి తన సినిమాల కంటే వ్యక్తిగత విషయాల వల్లనే నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. టైగర్ ష్రాఫ్‌తో లాంగ్ రిలేషన్‌షిప్‌కు బ్రేక్ పడిన తర్వాత, ఈ భామ పంజాబీ పాప్ సింగర్ తల్విందర్ సింగ్‌తో ప్రేమలో ఉందంటూ గత కొన్ని రోజులుగా బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. కృతి సనన్ సోదరి నుపుర్ సనన్ పెళ్లి వేడుకల్లో దిశా, తల్విందర్ జం టగా సందడి చేయడంతో ఈ పుకార్లు షికారు చేశాయి. వీరిద్దరూ కలిసి దిగిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడి యాలో వైరల్ అవ్వడంతో, దిశా కొత్త ప్రియుడు ఇతడేనంటూ నెటిజన్లు ఫిక్స్ అయిపోయారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న తల్విందర్ సింగ్ (ౕజీశ్రీలితినిటవతీ ాతినిణప్త)ఈ వార్తలపై ఘాటుగానే స్పందించాడు. "మాపై ఇంత త్వరగా అందరి దృష్టి పడుతుందని ఊహించలేదు. మేం ఒకరినొకరు పరిచయమై కొద్ది కాలమే అవుతోంది. ప్రస్తుతం ఒకరి గురించి ఒకరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నాం. ఇలాంటి పుకార్ల వల్ల వచ్చే ఒత్తిడిని మేం కోరుకోవడం లేదు. మా మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే. దయచేసి తప్పుడు వార్తలు ప్రచారం చేయకండి" అని తల్విందర్ స్పష్టం చేశాడు.అయితే, ఇంటర్వ్యూ చివరలో యాంకర్ అడిగిన ఓ ప్రశ్నకు తల్విందర్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు మరింత ఆసక్తికరంగా మారింది. "మీకు ప్రేమపై నమ్మకం ఉందా?" అని అడగ్గా.. "నేను ప్రతిరోజూ ప్రేమిస్తూనే ఉంటాను, ఇప్పుడు కూడా ప్రేమిస్తున్నాను" అంటూ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో అతను దిశాను ఉద్దేశించే ఈ కామెంట్స్ చేశాడా? అనే చర్చ మళ్ళీ మొదలైంది. కొంతమంది ట్విస్ట్ అదిరిపోయిందని అంటున్నారు.

# మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com